

కడ్తాల్ : ఎమ్మెల్సీ కవితకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు

మాజీ సర్పంచ్‌ల సమస్యలపై వినతి

కడ్తాల్, జనవరి 4 : భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శనివారం ఆమె నివాసంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి రాష్ట్ర సంఘం నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తాజా మాజీ సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీకి వివరించినట్లు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.

రూ.15 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు

దోమ : వికారాబాద్ జిల్లావ్యాప్తంగా సర్పంచ్‌లకు రూ.15 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందని సర్పంచ్‌ల సంఘం నాయకుడు రాజిరెడ్డి శుక్రవారం రాత్రి రాష్ట్ర సర్పంచ్‌ల ఐకాసా నాయకుడు నర్సింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డితోఎమ్మెల్సీ కవితను కలిసి వివరించారు. మాజీ సర్పంచ్‌లు పనులను పూర్తి చేసినప్పటికీ బిల్లులు ట్రెజరీల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సర్పంచ్‌లు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారని వారి బిల్లులు రాక గోసపడుతున్నారని విన్నవించారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మూడు నెలల గ్రాంట్స్ రిలీజ్ చేయలేదని తెలుపుతూ.. చట్టపరంగా మండలిలో ఈ అంశంపై మాట్లాడి మాజీ సర్పంచ్‌లకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు.

చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుంచం సతీశ్‌కుమార్ తండ్రి శ్రీహరి అనారోగ్యంతో మృతిచెందారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి నాయకులతో కలిసి శనివారం ఉదయం చేవెళ్లలోని మృతుడి నివాసానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. - చేవెళ్లటౌన్, జనవరి 4

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ, ఆయా శాఖల అధికారులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- రాష్ట్ర బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్

వికారాబాద్, జనవరి 4 : రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం మంత్రి హైదరాబాద్ నుంచి రోడ్డు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి రోడ్డు భద్రతా మాసోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించేదని, దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర సర్కారు రోడ్డు భద్రతా మాసోత్సవాలను చేపడుతున్నదన్నారు. కార్యక్రమంలో ప్రతి శాఖను భాగస్వామ్యం చేస్తూ వినూత్నంగా ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పిల్లల్లో రోడ్డు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులతో ప్రతి జిల్లా , మండల హెడ్ క్వార్టర్‌లో భారీ ర్యాలీ చేపట్టాలన్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ తమ పరిధిలో రోడ్డు భద్రతా ప్రమాణాల కార్యక్రమాలు జరగాలన్నారు. రవాణా శాఖ, పోలీస్ శాఖ, విద్యా శాఖ, రోడ్డు భవనాలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు భద్రతా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. పాఠశాలల్లో రోడ్డు భద్రతా ప్రమాణాలపై పోటీ పరీక్షలు నిర్వహించాలన్నారు. రోడ్డు భవనాల శాఖ స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. ఈ నెల మొత్తం రోడ్డు భద్రతా ప్రమాణాల కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో 75% డ్రైవర్ తప్పిదాలతోనే జరుగుతున్నాయన్నారు. ప్రతి జిల్లాస్థాయిలో రోడ్ సేఫ్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించి, ఆక్సిడెంట్ ప్రోన్ ఏరియా గుర్తించాలని, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాలపై లోకల్, కేబుల్ చానల్స్‌లో టెలీకాస్ట్ అయ్యేలా చూడాలన్నారు. రోడ్డు భవనాల శాఖ, పంచాయతీ రోడ్డు, జాతీయ రహదారుల్లో అవసరమైన సైన్‌బోర్డులు ఉండేలా జిల్లా రవాణా శాఖ అధికారి పర్యవేక్షించాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. అన్ని శాఖ ల సమన్వయంతో ప్రణాళికా ప్రకారం రోడ్డు భద్రతా మాసోత్సవాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అధికారులందరితో కలిసి రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్‌లను విడుదల చేశారు. సమావేశంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ అధికారి శ్రవణ్ ప్రకాశ్, ఆర్టీసీ డీఎం అరుణ, ఏడీ మైన్స్ సత్యనారాయణ, డీఈవో రేణుకాదేవి, రవాణా శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క
- నందిగామ మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి శంకుస్థాపనలు

చేగూరులో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క, ఎమ్మెల్యే శంకర్

నందిగామ, జనవరి 4 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉన్నదని, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. నందిగామ మండలంలోని అప్పారెడ్డిగూడలో రూ.25లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, వీర్లపల్లిలో బంగోనిగూడ నుంచి షాద్‌నగర్ వరకు రూ.19.40 కోట్లతో బీటీ రోడ్డు, చేగూరు నుంచి సింబియాసిస్ వరకు రూ.7 కోట్లతో బీటీ రోడ్డు పనులకు మంత్రి సీతక్క శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు.

అనంతరం చేగూరులో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని.. రానున్న రోజుల్లో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. చేగూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, బండోనిగూడ, బుగ్గోనిగూడ, వెంకమ్మగూడ, నర్సప్పగూడ గ్రామాల నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లున్నారు.

మహిళా సంఘాలకు రూ.50 కోట్ల నిధులు

షాద్‌నగర్ : వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మంత్రి సీతక్క మహిళలకు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనం, కమ్యూనిటీ భవనం బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని మహిళా సంఘాలకు రూ. 50 కోట్ల నిధులను అందజేస్తున్నామని, ఈ నిధులను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి చెందాలని కోరారు. కమ్మదనం నుంచి మధురాపూర్ గ్రామం మీదుగా శేరిగూడ వరకు రూ. 8 కోట్ల నిధులతో బీటీ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శంకర్, నారాయణరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ నియోజకవర్గ పర్యటకు వచ్చిన మంత్రికి వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. మధురాపూర్ గ్రామంలో పశువుల దవాఖాన ఏర్పాటు చేయడంతో పాటు సీసీ రోడ్లను నిర్మించాలని కోరారు. జీవో 81 ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్‌ఏల వారసులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని వీఆర్‌ఏల జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని ఆశ వర్కర్లకు కనీస వేతనంగా రూ. 18 వేలు ఇవ్వాలని షాద్‌నగర్ ఆశ వర్కర్లు వినతి పత్రం అందజేశారు.

తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ శనివారం బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌ను కేసీఆర్ శాలువాతో సత్కరించారు. - ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 4

ఆహ్వానం

చేవెళ్ల రూరల్, జనవరి 4 : శంకర్‌పల్లి మండల పరిధి చందిప్ప గ్రామ శివారులోని 11వ శతాబ్దానికి చెందిన బ్రహ్మసూత్ర మరకత శివాలయానికి రావాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిని నగరంలోని ఆయన నివాసంలో మరకత శివాలయం ఆల్ ఇండియా ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్‌రాజుస్వామి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేసి స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. ఈ నెల 6న ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పూజలు నిర్వహిస్తానని మధుసూదనాచారి చెప్పినట్లు దయాకర్‌రాజు తెలిపారు.

లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి

జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి

వికారాబాద్, జనవరి 4 : లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి తెలిపారు. శనివారం వికారాబాద్ మండల మహిళా సమాఖ్య హాల్‌లో మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో 7045 అంధులున్నారని, వారందరికీ లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. బ్రెయిలీ చిన్న వయస్సులో ఒక మేకు తన కంటిలో గుచ్చుకోవడం వల్ల కండ్లు పోగొట్టుకున్నారని తెలిపారు. కానీ అతడు ఎన్నో రకాల బాధలు అనుభవించి అంధుల కోసం ఒక ప్రత్యేకమైన ఆరు చుక్కల లిపిని కనుక్కొని.. వారు కూడా సమాజంలో అందరిలాగా చదువుకునే అవకాశం కల్పించారని పేర్కొన్నారు. శాఖ ద్వారా అంధులకు రెండు ల్యాప్‌టాప్‌లు, 4 స్మార్ట్ కేన్స్, ఇద్దరికి వివాహ ప్రోత్సాహక బహుమతులను 23-24 సంవత్సరంలో ఇవ్వడం జరిగిందన్నారు. డిపార్ట్‌మెంట్ తరపున దివ్యాంగులు, అంధులకు పెన్షన్ అందిస్తున్నామని, సదరం క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ, మెహర్ ఉన్నీసా, వెంకటేశ్వరమ్మ, కాంతారావు, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ వెంకటేశ్, సూపర్‌వైజర్స్, మహిళా సాధికారత కేంద్ర బృందం పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన దివ్యాంగులు

ఏఎన్ఎంల వేతనాలు చెల్లించాలి

హైదరాబాద్‌లోని సచివాలయంలో జీవీఎస్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఉద్యోగులు

కులకచర్ల, జనవరి 4 : గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు 11 నెలల వేతనాలు చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఏఎన్ఎంలకు గత సంవత్సరం నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో హనుమకొండ, మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల, జనగాం, వరంగల్, సిద్దిపేట జిల్లాల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వృత్తిపరమైన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ): పోలీసులు నిరంతరం వృత్తిపరమైన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి అన్నారు. నూతన సంవత్సరంలో సాధించాల్సిన లక్ష్యాలపై శనివారం కమిషనరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందినుద్దేశించి మాట్లాడారు. గత సంవత్సరం ఎన్నో లక్ష్యాలను సాధించామని, అదే స్ఫూర్తితో ఈ కొత్త సంవత్సరంలో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. పోలీసు సిబ్బంది అంకితభావం, దృఢ సంకల్పంతో పనిచేయాలని, కంప్యూటర్ యుగంలో కీలకంగా మారిన ఐటీ సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ జోయల్, కమిషనరేట్ పరిధి ఐదు జోన్‌ల డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలున్నారు.

మెట్రో స్టేషన్ పేరు మార్చాలి

సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : ఎల్బీనగర్-మియాపూర్ మార్గంలో ఉండే విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ పేరును మార్చు చేయాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. శనివారం వీహెచ్‌పీ ప్రతినిధుల బృందం మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డిని కలిసి సూచనలు చేశారు. ఈ మేరకు మెట్రో స్టేషన్ మెట్లు అష్టలక్ష్మి టెంపుల్ ప్రధాన మార్గం వద్దనే ఉన్నాయని, ఆ స్టేషన్‌కు కచ్చితంగా అష్టలక్ష్మి మెట్రో స్టేషన్‌గా నామకరణం చేయాలని వినతిపత్రంలో కోరారు.

రంగారెడ్డి జిల్లా-2 ఆర్యవైశ్య అధ్యక్షులుగా శ్రీధర్, స్రవంతి

మణికొండ, జనవరి 4 : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య ఆఫీసర్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) రంగారెడ్డి జిల్లా అర్బన్-2 అధ్యక్షులుగా మణికొండకు చెందిన బొడ్డు శ్రీధర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గజ్జల స్రవంతిని నియమిస్తున్నట్లు రాష్ట్ర ఆర్యవైశ్య ఆఫీసర్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ శనివారం వెల్లడించారు. ఈ మేరకు మణికొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన బొడ్డు శ్రీధర్, గజ్జల స్రవంతిలకు నియామక పత్రాలను అందజేశారు. నూతన అధ్యక్షులు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో అవోపా అభివృద్ధి కోసం శక్తివంచనలేకుండా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ ఆర్యవైశ్య ప్రతినిధులున్నారు.

ఔత్సాహిక రచయితలు, దర్శకుల శిక్షణా శిబిరం

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పార్థసారథి, డా.మామిడి హరికృష్ణను సన్మానిస్తున్న తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఫౌండర్, ప్రెసిడెంట్ నాగబాలసురేశ్‌కుమార్

రవీంద్రభారతి : భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత్ కల్చరల్ అకాడమీ, ఓం సాయితేజ ఆర్ట్స్ సహకారంతో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం శిక్షణా శిబిరం శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. వక్తలుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పార్థసారథి, భాషా సాంస్కృతిక సంచాలకులు మామిడి హరికృష్ణ, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఫౌండర్, ప్రెసిడెంట్ నాగబాల సురేశ్‌కుమార్ విచ్చేశారు. వక్తలు పార్థసారథి మాట్లాడుతూ.. తెలుగు టెలివిజన్ రచయితల సంఘం యువదర్శకులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. మంచి సినిమాతో సమాజంలో మార్పులు వస్తాయని, అది నిర్మాత, దర్శకుల బాధ్యత అని అన్నారు.నాగబాల ఔత్సాహిక రచయితలు, దర్శకులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీశైలమూర్తి, ప్రముఖ డీఓపీ మీర్, దర్శకులు ప్రేమ్‌రాజు, చల్లా భానుకిరణ్ ,కర్ర నరేందర్‌రెడ్డి, చిత్తరంజన్‌దాస్, శ్రీనివాస్‌రాజు, రమోజు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఒడిస్సీ నృత్య ప్రదర్శన

కొండాపూర్, జనవరి 4 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా 'ఒడిస్సీ నృత్య సుధా' పేరుతో ప్రదర్శించిన ఒడిస్సీ నృత్యాలు ఆద్యంతం అలరించాయి. కళాకారులు తృప్తి సుధా సాహూ, దర్వి, ఇనాయ, చార్వి, అక్షిత, వర్షపాండా, సుకన్య తదితరులు మంగళచర్యం, వక్రతుండ, అభినయ, స్థాయీ, మేఘ పల్లవి, శబరి పల్లవి, బసంత్ పల్లవి, దుర్గస్తుతి, జగన్నాథాష్టకం అంశాలను ఒడిస్సీ నృత్యరూపకంలో ప్రదర్శించారు.

మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ పరీక్షా ఫీజు

ఓయూ, జనవరి 4 : ఓయూ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 9వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

మన్సూరాబాద్, జనవరి 4: ప్రభుత్వాలపై ఆధారపడకుండా సొంత నిధులతో కాలనీని అభివృద్ధి చేసుకోవడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్ డివిజన్ పరిధి నిత్య హోమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సొంత నిధులు రూ.12 లక్షలతో కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న మంచినీటి పైపులైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. శివారు కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు పూర్తిస్తాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కోట్లాది రూపాయలతో అండర్‌పాస్ రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మించి ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని ట్రాఫిక్ ఫ్రీ జోన్‌గా తీర్చిదిద్దడం జరిగిందని పేర్కొన్నారు.

అలరించిన నృత్యప్రదర్శనలు

మాదాపూర్, జనవరి 4 : మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో శనివారం పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా గురుకులం మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కూచిపూడి నృత్య గురువు పోపూరి లక్ష్మీతులసి శిష్య బృందం పోపూరి షణ్ముఖ వేద, కృతి, సంహిత, హర్షిత, చక్రిక, వెంకట భావిక సంయుక్తంగా కూచిపూడి నృత్యంతో ఆనంద నర్తన గణపతి, కొలువైతివి రంగసాయి, తక్కువేమీ మనకు, అలరులు కురియగా, ముద్దుగారే యశోద, పలుకు తేనెల తల్లి, నిరాయణతే సినర్జీ, ఎంత మాత్రమున వంటి సంకీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేసి ప్రశంసించారు.